ప్రజాశక్తి

మంగళవారం 27 ఆగస్టు 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

తొలగని ఇసుక కష్టాలు



టోకెన్ల కోసం తుళ్లూరులో క్యూలో నిల్చున్న లారీ డ్రైవర్లు

- ఉచితం పాక్షికం-మారుబేరం అధికం
- దూర పెరిగి ఛార్జీలు తడిసి మోపెడు
- రవాణా ఖర్చులు నియంత్రణపై కొరవడిన దృష్టి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఉచిత ఇసుక విధానం వల్ల వినియోగదారులకు పాక్షిక ప్రయోజనాలు అందుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే మాదిరిగా ఇసుక కొనుగోలులో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా రవాణా ఛార్జీల భారం ఎక్కువగా ఉంటోంది. రీచ్‌ల వద్ద కాకుండా స్టాక్ యార్డుల వద్ద ఇసుక విక్రయాలు ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నాయి. ఈ స్టాక్ యార్డులకు దూరంగా ఉన్న ప్రాంతాలకు ఇసుక విక్రయాల ధర మరింత ఎక్కువగా ఉంటోంది. దగ్గర ప్రాంతాలకు సాధారణ ధరలకు లభిస్తున్నాయి.

గుంటూరు జిల్లాలో రెండు స్టాక్ యార్డుల ద్వారానే ఇసుక సరఫరా జరుగుతోంది. నాలుగు స్టాక్ యార్డులు ఏర్పాటు చేస్తామని చెప్పిన అధికారులు ఆదివారం కేవలం తాళ్లాయపాలెం, లింగాయపాలెం యార్డుల్లోనే ఇసుక విక్రయించారు. ప్రస్తుతం నాలుగు బుకింగ్ కేంద్రాల ద్వారా ఇసుక కొనుగోలుకు అవకాశం కల్పించారు. తుళ్లూరు మండలం తాళ్లాయాపాలెం, లింగాయపాలెం స్టాక్ యార్డుల నుంచి తెనాలి, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాలోని గ్రామీణ ప్రాంతాలకు ఇసుకను తీసుకువెళ్లేందుకు రవాణా ఛార్జీలు ఎక్కువ అవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. కొల్లిపర మండలంలోని ఇసుక రీచ్‌లకు ఇంకా అనుమతి లేదంటున్నారు. తాడేపల్లి ▶ 2లో

నిలకడగా మిర్చి ధరలు

ఈ ఏడాది విస్తీర్ణం తగ్గే అవకాశం

ఇతర రాష్ట్రాల్లో విస్తీర్ణం పెరుగుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు మిర్చి యార్డులో ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. సీజన్‌లో ధరలు తగ్గడం వల్ల భవిష్యత్తులో ధరలు పెరిగినప్పుడు విక్రయించుకోవాలన్న ఆశతో రైతులు కోల్ట్ స్టోరేజీల్లో మిర్చిని నిల్వ చేసుకున్నారు. అయినా గత రెండు నెలలుగా ధరలు పెరగడం లేదు. గత వారం గుంటూరు యార్డుకు స్థానిక కోల్డ్ స్టోరేజీల నుంచి 2.70 లక్షల టిక్కిలు, ఇతర ప్రాంతాలలో ఉన్న స్టోరేజీల నుంచి 80 వేల బస్తాలు కలిసి మొత్తం 3.50 లక్షల టిక్కిలు అమ్ముడుపోయాయి. కాగా ఇందులో గతేడాది పాత సరుకు 60 శాతం 40 శాతం కొత్త సరుకు విక్రయించారు.

తేజ, 341, 334, సూపర్-10 లాంటి డీలక్స్ రకాలకు డిమాండ్ కొనసాగుతుండగా ఇతర రకాల ధరలు నిలకడగా ఉన్నాయి. రాబోయే రోజులలో మిర్చి ధరలు పెరిగే అవకాశం లేనందున ఎక్కువ మంది వ్యాపారులు, ఎగుమతి దారులు, రైతులు తమ నిల్వ సరుకు విక్రయించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అంతేగాకుండా ఈ ఏడాది రాష్ట్రంలో పండించిన మిర్చికి డిమాండ్ తగ్గింది. ఇప్పటికే పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో సేద్యం పెరిగింది. ఈ ప్రాంతాల్లో ఇప్పటి వరకు సానుకూల వాతావరణం కొనసాగుతున్నందున పంటకు ప్రయోజనం చేకూరుతున్నది. అయితే, కొందరు రైతులు పచ్చి కాయలకు లాభసాటి ధర లభిస్తున్నందున భారీగా సరుకు విక్రయిస్తున్నారు. దీంతో గుంటూరు మిర్చికి ▶ 2లో

సెప్టెంబర్ 25న చెకుముకి సైన్స్ సంబరాలు 8లో

జంగిల్ క్లియరెన్స్‌లో వెలుగులోకి

శాశ్వత సచివాలయం శిలాఫలకం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో చేపట్టిన జంగిల్ క్లియరెన్స్‌లో సోమవారం శాశ్వత సచివాలయం శిలాఫలకం కనిపించింది. వైసిపి ఐదేళ్ల పాలనలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో వేల ఎకరాల్లో పిచ్చికంప, ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించిన రాళ్లు, పునాదుల దశలో నిలిచిపోయిన పలు నిర్మాణాలకు చెందిన శిలాఫలకాలు చెల్ల మధ్యలోనే కనిపించకుండా ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నెల 8వ తేదీ నుంచి రాజధానిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టింది. 100కు పైగా పొక్లెయినర్లతో పిచ్చికంప, ముళ్ల చెట్లు తొలగించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో రైతులకు కేటాయించిన ప్లాట్లతో పాటు శాశ్వత సచివాలయం నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం వెలుగు చూసింది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శంకుస్థాపన చేసిన సదరు శాశ్వత సచివాలయం శంకుస్థాపన శిలాఫలకం పిచ్చికంప, చెట్లు తొలగించడంతో వెలుగులోకి వచ్చింది. రాజధాని రైతులు పువ్వాడ భరత్ కుమార్, కామినేని గోవిందమ్మ, అరుంధతి, ఆలూరి రజిని తదితరులు శిలాఫలకాన్ని సందర్శించారు. రాజధానిలో చంద్రబాబు తాత్కాలిక నిర్మాణాలతో సరిపుచ్చారని అబద్ధపు ప్రచారం చేశారని, శాశ్వత సచివాలయం, హైకోర్టుతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాధిపతుల (హెచ్‌వోడి) కార్యాలయాలు తదితర నిర్మాణాలకు చంద్రబాబు అవసరమైన చర్యలు తీసుకున్నారని చెప్పారు.



శాశ్వత సచివాలయం శిలాఫలకం వద్ద రాజధాని రైతులు

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

కమిటీలు పూర్తి బాధ్యత తీసుకోవాలి

గుంటూరు జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్

రాబోయే వినాయక చవితి సందర్భంగా పందిరి, మండపాలు ఏర్పాటు చేసుకోదలచిన వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఇచ్చి వారి గుర్తింపు కార్డు నకలు కాపీలు జత చేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ లేదా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్థలాల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేయదలచిన వారు ముందుగా సదరు ప్రైవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ/మున్సిపాలిటీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవడంతోపాటు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా వినాయక చవితి పందిళ్ళు, మండపాలు వద్ద ఇసుక, నీళ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల్లో దీపారాధనల వలన అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రతలు తీసుకుంటూ ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరుగకుండా వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలని కోరారు. విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ బాక్స్‌లను ఉపయోగించాలని, భద్రత కొరకు రాత్రి సమయాల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ వారి ప్రతినిధులు కాపలా ఉండాలని స్పష్టం చేశారు. పందిళ్లు గాని, విగ్రహం పెట్టే ప్రదేశం గాని రోడ్డుపైన ఉండరాదని, బ్యానర్లు కాని, ఫ్లెక్సీలు గాని రోడ్డుపైన ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని పేర్కొన్నారు. ఊరేగింపు సమయంలో మందుగుండు సామగ్రిని పేల్చరాదని, పందిళ్ల వద్ద అనుచిత ప్రదర్శనలు, అసభ్య నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేయకుండా కమిటీ వహించాలని పేర్కొన్నారు. నిమజ్జన ఊరేగింపునకు అనుమతించిన సమయం, నిమజ్జనకు కేటాయించిన ప్రదేశం, ఊరేగింపునకు కేటాయించిన మార్గం తదితర నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. నిమజ్జనానికి వెళ్లే వాహనంపై మద్యం లేదా మత్తు పదార్థాలను సేవించిన వారు లేదా మైనర్‌లు ఉండరాదని, వెలుతురు వుండగానే నిమజ్జన ప్రదేశానికి వెళ్లాలని, ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా రద్దీని నివారించేందుకు, భద్రత కోసం తగినంత మందిని అ ఏరియా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనానికి చిన్న పిల్లలను, మద్యం సేవించిన వారిని తీసుకెళ్లరాదని, శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని కోరారు.

వానాకాలం.. పిల్లల ఆనారోగ్యానికి అవకాశం..

ఆరోగ్య పరిరక్షణకు అప్రమత్తత అవసరం

చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పావులూరి విజేత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వర్షా కాలం నేపథ్యంలో చిన్న పిల్లలకు వచ్చే వ్యాధుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హన్విత హాస్పిటల్ చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ పావులూరి విజేత సూచించారు. వర్షాకాలంలో సాధారణంగా పిల్లలకు జలుబు, విరేచనాలు, చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తలనొప్పి, జ్వరం, మలబద్ధకం, ఆకలి మందగించడం వంటి అనేక లక్షణాలు పిల్లల్లో కనిపిస్తాయని చెప్పారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా కేసులు కూడా వర్షా కాలంలోనే ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా చిన్న పిల్లల వైద్యులను సంప్రదించి వెంటనే చికిత్స ఇప్పించాలని సూచించారు. చిన్నారులకు ఫ్లూ, వైరల్ ఫీవర్, డయేరియా, టైఫాయిడ్, హెపటైటిస్, కామెర్లు, ఒళ్లు నొప్పులు ఉంటాయన్నారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు పెరుగుతాయని ఇవి ఆహారం మీద వాలడం వల్ల అనేక వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. నీటి కలుషితం కారణంగా వైరస్‌లు, బ్యాక్టీరియాలు వృద్ధి చెంది ఫ్లూ, ఆస్తమా, ఎలర్జీ వచ్చే అవకాశం ఉందన్నారు.



పిల్లలు నీటికి ఎక్కువగా ఆకర్షితులవుతుంటారని, వర్షాకాలంలో చాలాచోట్ల మురుగు కలిసిన వర్షపు ఆటలు ఆడితే అనారోగ్యం బారిన పడతారన్నారు. చిన్న పిల్లలు ఏది పడితే అది ముట్టుకుని అదే చేతి వేళ్లను నోటిలో పెట్టుకుంటారని, అటువంటి పరిస్థితిల్లో, వారు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలను మురికి నీటిలో ఆడుకోనివ్వకూడదని, ఇంటి చుట్టూ మురికి నీరు చేరకుండా చూసుకోవాలని, బయటి ఆహారం తినిపించొద్దని సూచించారు. ఆడుకోవడానికి బయటకు వెళ్లినప్పుడు నిండు చేతుల బట్టలు వేయాలని, తద్వారా దోమలు కుట్టవని బట్టలు తడిస్తే వెంటనే మార్చుకోవాలని చెరువులు, కాలువలు, ఈతకొలను (స్విమ్మింగ్ పూల్)లో పిల్లలను ఆడుకోనివ్వకూడదని చెప్పారు. నోటిలో వేళ్లు పెట్టుకునే అలవాటు ఉఉంటే మాన్పించాలన్నారు. తడి బట్టలు అస్సలు ధరించకూడదని, ఇంట్లో కరెంటు స్విచ్‌లు పిల్లలకు అందకుండా ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేయాలని సూచించారు.

రాజధాని దీక్షా శిబిరంలో కృష్ణాష్టమి

ప్రజాశక్తి-తాడికొండ

నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలోని అమరావతి రాజధాని దీక్ష శిబిరం వద్ద సోమవారం కృష్ణాష్టమి వేడుకను ఘనంగా నిర్వహించారు. చిన్నారులను కృష్ణుని వేషధారణలో అలంకరించారు. వేడుకల సందర్భంగా సంప్రదాయనృత్యాలు ఏర్పాటు చేశారు. టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరావు, గ్రామ నాయకులు ఈదా రవి, చింతలలంక నాంచారయ్య, షేక్ రఫీ, కాసింశెట్టి సదా, చొప్పర యాకోబు, ఉండవల్లి రాజేష్, మిక్కిలి కిరణ్, మొగిలి గోపి, పొట్లూరు లక్ష్మీనారాయణ, ధనేకుల హరిబాబు, నీరుకొండ పెద్దబ్బాయి, కంతేటి అంజయ్య, జొన్నలగడ్డ సదా, పెద్ది తిరుపతిరావు, అప్పారావు, మువ్వా రవి పాల్గొన్నారు.



శిబిరం వద్ద వేషధారణలో చిన్నారులు

వైద్యురాలిపై హత్యాచారం దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఐఎంఎ పల్నాడు జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు



దేశంలో సంచలనం సృష్టించిన కలకత్తా ట్రైనీ డాక్టర్ మృతికి కారణమైన అసలు దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఇటువంటి హింసాత్మక ఘటనలకు తావు లేకుండా మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) పల్నాడు జిల్లా అధ్యక్షులు, నరసరావుపేట మథర్ థెరిస్సా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో మహిళలపై, చిన్నారులపై, చివరకు వృద్ధ మహిళలపై అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా వైద్యురాలి ఘటనను సుప్రీం కోర్టు సుమోటోగా కేసు తీసుకునే వరకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఊగిసలాడారని విమర్శించారు. దేశంలో వైద్యులతో పాటు సామాన్య ప్రజలకు, కవులు, కళాకారులు, అభ్యుదయ రచయితలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మెడిసిన్ చదువుతున్న విద్యార్థినులకు మెడికల్ కళాశాలలో సరైన రక్షణ కల్పించి విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. నిర్భయ చట్టం లాంటి చట్టాలతో ప్రయోజనం లేదని మహిళలపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడం ద్వారా నేరాలను అదుపు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ట్రైనీ డాక్టర్ ఘటనకు ఇటీవల దేశవ్యాప్తంగా అత్యవసర వైద్య సేవలు మినహా సాధారణ వైద్య సేవలు 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేశామని, వైద్యురాలి కుటుంబానికి న్యాయం జరగకపోయినా, నిందితులకు కఠిన శిక్ష అమలు చేయకపోయినా ఐఎంఎ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం స్పందించి మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

- **ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు**
- **ప్రజాశక్తితో నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు**

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచామని అసాంఘిక కార్యక్రమాలు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని డీఎస్పీ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇటీవల నరసరావుపేట డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. పాలు, వంట నూనె, బయో ఎరువులు, పురుగు మందుల నకిలీ తయారీకి అడ్డాగా నరసరావుపేట ఉన్న నేపథ్యంలో వాటి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. దీంతోపాటు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకపోవడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని, ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెంట్ ధరించాలని కోరారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రుల పైనా కేసు నమోదు చేస్తామన్నారు. ఇటీవల వరవకట్టలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాల్లేని 46 ద్విచక్ర వాహనాలను, రెండు ఆటోలను సీజ్ చేశామని తెలిపారు. నంబర్ ప్లేట్, వాహన ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్ లేకుండా పట్టుబడితే వాహనం సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం మత్తులో డ్రైవింగ్, రాంగ్ రూట్లో డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగంపై, గంజాయి రవాణా, నాటు సారా తయారీ, మత్తు పదార్థాల నివారణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వీటిపై సమాచారం ఏమైనా ఉంటే పోలీసులకు తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. యువత మత్తు పదార్థాలకు, జూదాలకు, బెట్టింగ్, ఆన్‌లైన్ ఆటలకు దూరంగా ఉండాలని, మంచి లక్ష్యాన్ని పెట్టుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

శిథిలావస్థకు వంతెన - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - తెనాలి



రోడ్లు వంతెనలు ప్రమాదాలను శంకిస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన వంతెన మాత్రం ప్రయాణికుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. మండలంలోని హాఫ్‌పేటలో వంతెన ప్రమాదకర స్థితికి చేరింది. పూర్తిగా ఇరువైపులా గోడలు దెబ్బతిని, రాళ్లు రాలిపోయి ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. వంతెనపై రోడ్డు గుంతల మయమై వానొస్తే చెరువును తలపిస్తుంది. సాధారణంగా బలహీనపడిన వంతెనపై గుంతలు ఉంటే అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాల దెబ్బకు వంతెన మరింత కదిలిపోయే ప్రమాదం ఉంది. అయినా అధికారుల్లో చలనం లేదు. కొద్ది నెలల క్రితం ఆర్అండ్‌బి అధికారులు 'వంతెన బలహీనంగా ఉంది, అధికలోడుతో వాహనాలు ప్రయాణించరాదు' అంటూ ఫ్లెక్సీని కూడా ఏర్పాటు చేసినా తర్వాత తొలగించారు. ఈ మార్గంలో ఇసుకలోడుతో ప్రయాణించే టిప్పర్లు, ఆర్టీసీ బస్సులు, విద్యాసంస్థలకు చెందిన వాహనాలు, కొల్లిపర ఇటుకలోడు లారీలు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనలలో ఉన్నారు. ఇసుకలోడు టిప్పర్లు అయితే సాధారణంగానే అధిక బరువుతో ఉంటాయి. దీనిలో 10 టన్నులు, 18 టన్నుల ఇసుక పట్టే టిప్పర్‌లు ఉంటాయి. దానిలో పరిమితికి మించి ఇసుకను లోటు చేయటం వ్యాపారులకు అలవాటే. ప్రమాదకరమని తెలిసినా అదే వంతెనపై వాహనాలు యథేచ్ఛగా ప్రయాణిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించి వంతెనను పునర్‌నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నిలకడగా మిర్చి ధరలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ఆశించిన డిమాండ్ రావడం లేదు. గుంటూరు మార్కెట్ యార్డులో అన్ని శీతల గిడ్డంగులలో నిల్వ ఉన్న వివిధ రకాల సగటు ధరలు ఇలా ఉన్నాయి. తేజ క్వింటాలు రూ.14,000-18,000, డీలక్స్‌రకం రూ.18,200-18,500, ఇతర రకాల రూ.12వేల నుంచి రూ.18 వేల వరకు ధరలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిర్చి విస్తీర్ణం తగ్గుతుందని భావిస్తున్నారు. పంట మార్పిడిలో భాగంగా ఈ ఏడాది మిర్చి బదులు పత్తి, కంది, పొగాకు,సోయాబిన్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. రాష్ట్రంలో మిర్చి సాగుకు మెరుగైన అవకాశాలు ఉన్నా ఇతర రాష్ట్రాల్లో విస్తీర్ణం పెరగడం వల్ల గుంటూరు మిర్చికి కూడా క్రమంగా డిమాండ్ తగ్గుతోంది. దీంతో ఈ ఏడాది ధరలు 30 శాతం వరకు తగ్గాయి. ఉమ్మడి జిల్లాలో 1.80 లక్షల నుంచి 2 లక్షల ఎకరాల్లో మిర్చి సాగుకు అవకాశం ఉంది. అయినా గతేడాది సాధారణ విస్తీర్ణంలో 1.60 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారు. అయినా ఈ ఏడాది ధరలు నామమాత్రంగా రావడం వల్ల రైతులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు.

తొలగని ఇసుక కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

మండలంలో రీచ్‌లూ పూర్తిగా పనిచేయడం లేదు.


పల్నాడు జిల్లాలో కేవలం రెండు స్టాక్ యార్డులను నిర్వహిస్తున్నారు. దీంతో దూర ప్రాంత వాసులకు రవాణా ఛార్జీలు తడిసిమోపెడవుతున్నాయి. టన్నుకు సగటున రూ.500 రవాణా ఛార్జీలు అదనపు భారం పడుతోందని వినియోగదారులు చెబుతున్నారు. మాదిపాడులో టన్ను రూ.192 మాత్రమే నిర్ణయించినా ట్రాక్టరు ఇసుక రూ.3 వేల నుంచి రూ.4 వేలు అవుతోంది. కొండమోడులో టన్ను రూ.564గా నిర్ణయించినా టన్ను రవాణా ఛార్జీలతో కలిపి రూ.వెయ్యి వరకు పలుకుతోంది. అయితే కొండమోడులో సరఫరా నామమాత్రంగా ఉంటోంది. సోమవారం రాత్రి కొండమోడులో ఇసుక నిండుకుందని చెబుతున్నారు. జిల్లాలో స్థాయిలో రవాణా ఛార్జీలకు సంబంధించి తగిన నిర్ధారణ జరగపోవడం వల్ల వినియోగదారులకు భారం తగ్గడం లేదు. మాచర్ల, వినుకొండ, నర్సరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాలకు ఇసుక తీసుకువెళ్లడం భారంగా మారింది. జిల్లా అంతటా అన్ని రీచ్‌ల నుంచి ఇసుక తీసి నియోజకవర్గానికి ఒక స్టాక్ యార్డు ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. స్టాక్ యార్డు నుంచి రవాణా దూరం గరిష్టంగా 30 కిలో మీటర్ల కన్నా తక్కువ ఉంటేనే ఉచిత ఇసుక లక్ష్యం నెరవేరుతుందని నిర్మాణ దారులు అభిప్రాయపడుతున్నారు.

ఇసుక బుకింగ్‌లో రెవెన్యూ యంత్రాంగం వల్ల వినియోగదారులు, లారీల వారు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు బుకింగ్‌కు అవకాశం కల్పించాల్సి ఉండగా మధ్యాహ్నం 11 గంటల వరకు బుకింగ్ ప్రారంభం కావడం లేదు. దీని వల్ల డంపింగ్ యార్డు వచ్చే వినియోగదారులు, లారీలు డ్రైవర్లు, సిబ్బంది పడుతున్నారు. దీని వల్ల కిరాయిలు పెరుగుతున్నాయని వారు చెబుతున్నారు. అధికారుల తీరుపై లారీ యూనియన్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగానే ఇప్పుడు కూడా తమకు సమస్యలు తప్పడం లేదంటున్నారు. గుంటూరు జిల్లాలో లోడింగ్, ఇసుక ధరతో కలిపి టన్ను రూ.250గా అధికారులు నిర్ణయించారు. కొనుగోలు దారుల్లో ఇళ్ల నిర్మాణంలో ఉన్న వారి కంటే అవసరం లేకున్నా రిటైల్‌గా విక్రయించుకోవాలన్న ఆతృత కలిగిన వారే ఎక్కువగా ఉండటం విశేషం. కొంత మంది మారుబేరం చేసుకోవాలన్న తలంపుతో ఇసుక తీసుకు వెళ్తున్న వారు కూడా కనిపించారు. 20 టన్నుల ఇసుక కొనుగోలుకు ఆధార్ కార్డు ఇస్తే సరిపోతుండటంతో ఉచిత ఇసుకలో అక్రమ విక్రయాలకు కూడా బిజం పడింది. స్థానికంగా కొంత మంది టిడిపి నాయకులు అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతున్నారని వీరి వల్ల ధర మరింత పెరుగుతోందని తెలిసింది.

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ప్రక్రియ నిలిపివేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాసగృహాలకు విద్యుత్‌స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో గహ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లకు వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు కోసం అదానీ సంస్థ సిద్ధమైందని, అవసరమైన సాంకేతిక సిబ్బందితో పని ప్రారంభించనున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు బిగించటమే కాకుండా ప్రీపెయిడ్ విధానాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకురానున్నదని, ఇకనుండి



సెల్‌ఫోన్ల తరహాలోనే స్మార్ట్ మీటర్లకు కూడా రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను విద్యుత్ సంస్థలు ఏర్పాటు చేయనున్నాయని, దీనివల్ల మనం ఇంట్లో వాడుకునే విద్యుత్‌కు ముందుగానే డబ్బు చెల్లించాల్సి ఉంటుందని, ఫలితంగా విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం స్మార్ట్‌గా రూ.4,486.93 కోట్ల భారం మోపనున్నదని తెలిపారు. ఈస్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు సంబంధించిన వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉండగా వ్యతిరేకించిందని, హైకోర్టులో పిటిషన్లు వేసిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట్లాడకపోగా ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను కొనసాగిస్తుందని విమర్శించారు. తక్షణమే అదానీ, షిర్డీ సాయి తదితర కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని, బిగించిన మీటర్లను తొలగించాలని కోరారు.



వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఎంటిఎంసి పరిధిలోని చిరావూరు గ్రామానికి చెందిన కాటూరు వెంకటేశ్వరరావుకు , టిడిపి చిర్రావూరు గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు వైద్య ఖర్చుల నిమిత్తం ఐదువేల రూపాయలను సోమవారం సాయంత్రం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా కాటూరు వెంకటేశ్వరరావు టిడిపి నాయకులకు కతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులకు పెన్నులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా లోకేష్ వివాహ వార్షికోత్సవ వేడుక

ప్రజాశక్తి - మంగళగిరి

మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజి శాఖల బ్రహ్మణి 17వ వివాహ వార్షికోత్సవ వేడుకలను మంగళగిరి పట్టణంలోని ఆంజనేయకాలనీలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లోకేష్ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయకాలనీలోని విద్యార్థులకు పెన్నులు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంటరీ పద్మశాలి సాధికార సమితి సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ, వంగర పెద్ద లక్ష్మయ్య, రాష్ట్ర సాధికార సమితి సభ్యులు అన్నం నాగబాబు, మున్నంగి శివ శేషగిరి రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గోవాడ రవి, వెంకట రామాంజనేయులు, బిట్ర నాగరాజు, జంపా ప్రభాకర్, పొట్లబత్తుల నరసింహారావు, కోవిలాకార్ రామకష్ణ, ఆకురాతి లక్ష్మణ్, కారంపూడి నాగేశ్వరరావు, తెలుగు మహిళా నాయకురాలు గోవాడ వెంకటలక్ష్మి, కేసనం అరుణకుమారి, వంగర అంజలి, అలుగురి వెంకటరమణ, మైలా దమయంతి, అనమర్లపూడి నాగమల్లేశ్వరి, కాకుమాను జ్యోతి పాల్గొన్నారు.



శ్రీకృష్ణ దేవాలయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల

ప్రజాశక్తి -పొన్నూరు

శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా పొన్నూరు పట్టణ 8వ వార్డు క్యాబిన్ పేటలోని శ్రీకృష్ణుని దేవాలయలంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో సోమవారం ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం నరేంద్ర కుమార్ ఉట్టి కొట్టి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని మాచవరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు కార్యక్రమంలో ప్రెసిడెంట్ మల్లి పోయిన నాగరాజు, సెక్రటరీ రెడ్డి బోయిన రాఘవ, టిడిపి పొన్నూరు పట్టణ అధ్యక్షులు జాగర్లమూడి సుధీర్ తెలుగుదేశం, జనసేన , బిజెపి, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టిప్పర్ కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఈపూరు



ప్రమాదవశాత్తు టిప్పర్ కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొండ్రముట్ల గ్రామం సమీపంలో ప్రైవేటు వెంచర్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బొల్లాపల్లి మండలం సోలాయపాలెం గ్రామానికి చెందిన నేరేటి శ్రీను(41) వినుకొండ మసీదు మాన్యంలో కూలిపనులు చేసుకుంటూ ఉంటున్నాడు. మేస్త్రితో పాటు పని కోసం శ్రీను వెంచర్ వద్దకు వెళ్లాడు. కంకర్ లోడుతో ఓ టిప్పర్ వెంచర్‌లోకి వచ్చింది. నేల కుంగుతుండడంతో టిప్పర్ కొద్దిగా ముందుకు వెళ్లి వెనక్కి వచ్చే క్రమంలో క్రమంలో శ్రీను ప్రమాదవశాత్తు టిప్పర్ కింద పడిపోయాడు. దీంతో అతని శరీర భాగాలు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చూసిన ట్రిప్పర్ డ్రైవరు మూర్ఛతో పడిపోయినట్లు స్థానికులు తెలిపారు. మృతుని తల్లి పేరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు.

రైలులో ప్రయాణిస్తూ వృద్ధుడు మృతి

ప్రజాశక్తి తెనాలి

రైలులో ప్రయాణిస్తూ వృద్ధుడు మృతి చెందిన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై తెనాలి జిఆర్పి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. ఒరిస్సా రాష్ట్రం గంజాం బొరాడా ప్రాంతానికి చెందిన బలరాం ప్రధాన్(66) కొట్టాయంలో ఇటుక బట్టి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అనారోగ్యానికి గురైన ఆయన రైలులో స్వగ్రామానికి బయలుదేరాడు. రైలు తెనాలి ప్రాంతానికి చేరుకున్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. ప్రయాణికుల సమాచారంతో జిఆర్పి పోలీసులు మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదపు తప్పి బస్సు బోల్తా

క్షేమంగా బయటపడిన ప్రయాణికులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

హైదరాబాద్ నుండి మాచర్లకు వస్తున్న ఆర్‌టిసి బస్సు మాచర్ల మండలం, ఏకోనామ్‌పేట సమీపంలో రహదారి అంచున ఒరిగి బోల్తా పడ్డ ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మాచర్ల డిపో బస్సు ఎపి 39జడ్ 0482 నెంబరు గల బస్సు హైదరాబాద్ నుండి బయలుదేరి మాచర్ల మండలం ఏకోనామ్‌పేట సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో 11 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్‌టిసి డిపో మేనేజర్ పిచ్చయ్య మాట్లాడుతూ ఆ ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బస్సు ఒరిగిందని వివరించారు. నెమ్మదిగా ఒరగటంతో సిబ్బందితో పాటు ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు.



బోల్తాపడ్డ లారీ



ఆట్యాపాట్యా జిల్లా జట్లు ఎంపిక

ప్రజాశక్తి - నకరికల్లు

ఆట్యా - పాట్యా పల్నాడు జిల్లా జూనియర్స్ బాల, బాలికల జట్లను మండల కేంద్రమైన నకరికల్లులోని వంగా వెంకటరెడ్డి జెడ్‌పి పాఠశాలలో ఎంపిక చేసినట్లు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ వి.రోహిత్ జోయల్ సోమవారం తెలిపారు. ఎంపికకు సుమారు 80 మంది హాజరైనట్లు తెలిపారు. ఎంపికైన జట్లు వచ్చేనెల 14, 15 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు చింతా పుల్లయ్య, జి.ఝాన్సీరాణి, తిరుమల బాయి, జానకి రామయ్య, పిఇటిలు పాల్గొన్నారు.

సౌరరంగంలో ఉచిత శిక్షణ, ఉపాధి

ప్రజాశక్తి - వినుకొండ

నిరుద్యోగ యువతీ, యువకుల కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీ (ఎన్‌ఐఎస్‌ఇ) సహకారంతో ఆంధ్రప్రదేశ్ న్యూ, రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సౌర రంగంలో 'సూర్యమిత్ర' పేరుతో ఆషా సొసైటీ నందు శిక్షణిస్తున్నట్లు ఆషా సొసైటీ డైరెక్టర్ షేక్ కరీముల్లా తెలిపారు. ఈ మేరకు వినుకొండలోని ఆషా సొసైటీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణలో చేరిన వారికి ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు. రెసిడెన్షియల్ విధానంలో మూడు నెలలపాటు కొనసాగే ఈ కోర్సులో చేరేందుకు ఐటిఐ, డిప్లొమా, ఇంటర్ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 30 మంది చొప్పున రెండు బ్యాచ్‌ను ఒకేసారి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉప యోగించుకోవాలని సూచించారు. సౌర రంగంలో అనేక ఉపాధి అవకాశాలు ఉండటంతో కేంద్రం ఈ శిక్షణనిస్తోందని, శిక్షణానంతరం ఉత్తీర్ణులైన వారికి స్కిల్ కౌన్సిల్ ఫర్ గ్రీన్ జాబ్స్ సంస్థతో సర్టిఫికెట్లు ఇవ్వడంతోపాటు ప్రముఖ సోలార్ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. వివరాల కోసం వినుకొండ-మార్కాపురం రోడ్‌లోని ఆషా సొసైటీలో సంప్రదించాలని, 7670985218, 94949 93755 ఫోన్ నంబర్లలోనూ సంప్రదించొచ్చని చెప్పారు.

18 వరకు 'గాలికుంటు' టీకాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వచ్చేనెల 18వ తేదీ వరకూ పట్టణంలోని అన్ని పశువుల ఆస్పత్రుల్లో టీకాలను ఉచితంగా వేస్తామని పసుమర్రు పశువైద్యశాల అధికారి డాక్టర్ దీప్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. గాలికుంటు వ్యాధి పశువులతోపాటు మేకలకూ వ్యాపిస్తుందని, ప్రస్తుతం ఆవులు, గేదెలకు మాత్రమే టీకాలు వేస్తామని తెలిపారు. వచ్చేనెల ఒకటోతేదీ నుండి డిసెంబర్ 31 వరకు గేదెలు, ఆవులు, ఇతర పశువులతోపాటు గొర్రెలు, మేకలు తదితర జీవాల గణన ఉంటుందని, ప్రతి ఐదేళ్లకోసారి మాదిరే ప్రస్తుతమూ వాటి సంఖ్యను లెక్కిస్తామని, యజమానులు, పోషకులు సహకరించాలని కోరారు. ఐదేళ్ల కిందట లెక్కించినప్పుడు గేదెలు, ఆవులు సుమారు 12 వేల వరకు ఉన్నాయని, గొర్రెలు, మేకలు తదితర జీవాలు 25 వేల వరకు ఉన్నాయని గుర్తు చేశారు. గడ్డి విత్తనాలు (జొన్న) ఐదు కిలోల బ్యాగును సబ్సిడీపై రూ.115కు ఇచ్చామని, స్టాకు మళ్లీ త్వరలో వస్తుందని, అవసరమైన వారు తీసుకోవాలని సూచించారు. పశువులు, జీవాలకు సంబంధించిన అన్ని రకాల మందులూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పైర్లకు తెగుళ్లపై అధికారుల పరిశీలన

నివారణపై రైతులకు సూచనలు - ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో పైర్లను పరిశీలిస్తున్న అధికారులు

పెసర, మినుముకు పండాకు తెగులుపై ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైన వార్తకు వ్యవసాయాధికారులు స్పందించారు. నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లోని మినుము, పెసర పైర్లను పరిశీలించి సస్యరక్షణ, యాజమాన్య చర్యలపై రైతులకు వివరించారు. నరసరావుపేట వ్యవసాయ ఉప సంచాలకులు ఎం.శివకుమారి మాట్లాడుతూ పెసర పంటను చాలామంది రైతులు పరిస్థితులు అనుకూలంగా ఉంటే సాగు చేయడం, నాగార్జునసాగర్ నీరు వస్తే పచ్చిరొట్టగా వాడవచ్చని, నీరు రాకపోతే పంట తీసుకోవచ్చు అనే ఉద్దేశంతో సాగు చేసి తగినంత శ్రద్ధ పెట్టకపోవడం వల్ల కలుపు విపరీతంగా పెరిగి పైరు గిడసబారిందన్నారు. ఇటీవల నాగార్జున సాగర్ నీరు వచ్చిన నేపథ్యంలో పచ్చిరొట్ట దున్నివేస్తామని రైతులు తమ దృష్టికి తెచ్చారన్నారు. నేల ఆరోగ్య పరిరక్షణ దష్ట్యా ఇది ఒక మంచి పద్ధతని రైతులను ప్రోత్సహించామని చెప్పారు. రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో మినుము పైరులో పల్లాకు, బొబ్బర తెగులు, మారుకా పురుగును గమనించామన్నారు. తెల్ల దోమ వ్యాప్తి ద్వారా పల్లాకు, బొబ్బర తెగులు, పేను బంక వ్యాపిస్తుందని, నివారణకు తక్షణమే తెగులు సోకిన మొక్కలను పొలం నుండి తొలగించి ప్రొఫినోఫాస్ 300 మిల్లీ లీటర్లు లేదా ఎసిటామిప్రైడ్ 400 గ్రాములు లేదా థయోమెథాక్సమ్ 400 గ్రాములు, మోనోక్రోటోఫాస్ 400 మిల్లీ లీటర్లు ఒక ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. మారుకా మచ్చల పురుగు నివారణకు నోవాన్ 200 మిల్లీ లీటర్లు లేదా ల్యాండాసైహాలోత్రిన్ 200 మిల్లీ లీటర్లు లేదా ఎమామెక్టిన్బెంజేట్ 80 గ్రాములు లేదా ఫ్లూబెండిఅమైట్ 40 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు. పంట గింజ దశలో ఉండి దిగుబడి ఆశాజనకంగా ఉన్న నేపథ్యంలో తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. పరిశీలనలో ఎడిఎ పి.మస్తానమ్మ, వివిఎలు పావని, వేమారెడ్డి, శ్రీహర్ష, ఎఇఒ బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

50 ఏళ్ల కిందటి అవసరాల ప్రకారం రోడ్లు

- వాహనాలు పెరిగిన నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు కృషి
- ప్రజలూ సహకరించాలి : ట్రాఫిక్ సిఐ బి.రమేష్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో 50 ఏళ్ల క్రితం అప్పటి రద్దీ మేరకు రోడ్ల విస్తరణ జరిగిందని, పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఏర్పడ్డాక రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారిందని నరసరావుపేట ట్రాఫిక్ సిఐ బి.రమేష్‌బాబు అన్నారు. ఈ మేరకు నరసరావుపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం ట్రాఫిక్ పెరిగినా సమస్యలు రాకుండా తమ సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. 2 లక్షల మందికిపైగా ఉన్న నరసరావుపేటలో 18 మంది ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారని, వీరితోనే ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నామని చెప్పారు. వ్యాపార సముదాయాలు, హాస్పిటళ్లలో సెల్లార్ పార్కింగ్ లేకపోవడంతోపాటు ఎక్కడా పార్కింగ్ స్థలాలు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. ప్రధానంగా మల్లమ్మ సెంటర్, సత్తెనపల్లి రోడ్డు, పల్నాడు రోడ్డు, స్టేషన్ రోడ్డు, మోర్ సెంటర్లలో ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ రద్దీ ఉంటుందన్నారు. దుకాణాలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు ఆయా మార్గాల్లో ఉండడంతో రద్దీగా ఉంటున్నాయన్నారు. ఇతర ప్రాంతాల నుండి నరసరావుపేట మీదుగా ఆయా ప్రాంతాలకు వెళ్లే వాహనాలు బైపాస్ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. వాహనదారులు ఎక్కబడితే అక్కడ వాహనాలు నిలపొద్దని కోరారు. పట్టణంలో వాహనదారులు, ఆటో డ్రైవర్లు, పాఠశాల, కళాశాలల బస్సులు, ఆర్టీసీ యాజమాన్యం ప్రజల సహకారంతో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు కృషి చేస్తున్నామన్నారు.



ఉట్టికొట్టిన ఎమ్మెల్యే కన్నా

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి పట్టణంలోని రంగా కాలనీలో సోమవారం జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని మహిళలతో కలిసి కోలాటం ఆడారు. అనంతరం స్థానికులతో కలిసి ఉట్టి కొట్టారు. టిడిపి నాయకులు వై.రామస్వామి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

29న చిట్టాపురం ఊరవారి చెరువు వేలం

ప్రజాశక్తి-ఈపూరు : మండలంలోని చిట్టాపురం పంచాయతీలో ఊరవారి చెరువులో చేపలు పెంచుకొనేందుకు 2024-25, 2025-26 సంవత్సరాల సంబంధించి వేలాన్ని ఈనెల 29న నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి హైమావతి సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొనదలిచేవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

వాహనదార్లకు లైసెన్స్ లేకుంటే కేసులు : సిఐ


ప్రజాశక్తి-మాచర్ల

వాహనదారులు నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సిఐ ప్రభాకర్‌రావు హెచ్చరించారు. సోమవారం మాచర్ల పట్టణంలోని పలు కూడళ్లలో ఎస్ఐ అనితారెడ్డితో కలసి వాహనాలు తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని పలు వాహనాలపై చలనాలు వేశారు. సిఐ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. తప్పని సరిగి నంబర్ ప్లేట్ ఉండాలన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వొద్దని సూచించారు.



సత్తెనపల్లి 'యజ్ఞ' నటులకు ఘన సత్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి:



చిలకోటి రఘురామ్, విటల్ గౌడ్ నిర్మాతలుగా చిత్త జల్లు ప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కిన యజ్ఞ సినిమా అన్ని ముఖ్య కేంద్రాల్లో ఇటీవల విడుదలైన నేపథ్యంలో సత్తెనపల్లి పట్టణంలోని శ్రీనివాస మహల్‌లో రెండు షోలు వేశారు. ఈ చిత్రంలో విలన్ భవానిదాస్ పాత్రను పాత్రికేయులు, ఉపాధ్యాయులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి అయిన చెన్నకేశవ నాయుడు పోషించగా, పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది మర్రి వెంకట సుబ్బారెడ్డి ఎస్పీ పాత్రలో నటించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి గౌరీశంకర్ పాత్రలో సుభాని నటించారు. ఒక ప్రత్యేక పాటలో పట్టణానికి చెందిన కొంతమంది కళాకారులు తళుక్కున మెరిశారు. దీంతో వీరిని వెండితెరపై చూసిన పట్టణంలోని తోటి కళాకారులు, శ్రేయోభిలాషులు, బంధువులు, అభిమానులు ఆనందానికి అవధులు లేవు. వారి వారి సన్నివేశాలు వచ్చినప్పుడల్లా ప్రేక్షకులు ఈలలు వేసి కేరింతలు కొట్టారు. మా లాయర్ గారు... మా మాస్టర్ గారు... అంటూ సంబరపడ్డారు. ఇంకా ఎన్నో పెద్ద సినిమాల్లో నటించి నటులుగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని, మా సత్తెనపల్లికి చెందిన వారు అంటూ మేమంతా గర్వంగా చెప్పుకోవాలని ఆకాంక్షించారు. చెన్నకేశవ నాయుడును, సుభానీని ఏఐటియుసి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి శ్రీనివాస మహల్ థియేటర్లో అభినందించారు. పి.రామకోటేశ్వరరావు, టి.రామతిరుపతిరావు, దాసరి తిరుపతిరావు, ఎం.వెంకట్రావు, ఎ.కోటేశ్వరరావు. ఆర్టీసీ నాగేశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

సాయం లేక తగ్గిన తమలపాకు సాగు

- పెరుగుతున్న పెట్టుబడులు - తగ్గుతున్న ధరలు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు
- చింతలపూడిలో తమలపాకు పరిశోధనా కేంద్రాన్ని పునః ప్రారంభించాలి

ప్రజాశక్తి -పొన్నూరు

శుభకార్యాలకు, ఆయు ర్వేదంలో, ఆహారంలో ఎక్కువుగా ఉపయోగించే తమలపాకు సాగు రైతులకు తలకు మించిన భారంగా మారింది. తమలపాకులో విటమిన్ సి, థయామిన్, నియాసిన్, రిబోఫ్లావిన్, కెరోటిన్, కాల్షియం వంటి పోషకాలు నిండుగా ఉన్నాయి. తమలపాకులు నమిలితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. . అలాగే విందు భోజనాలు ఆరగించిన తర్వాత తమలపాకులు వేసుకోవటం ఆరోగ్యప్రదాయిని అని పూర్వీకులు చెబుతుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న తమలపాకు తోటలు సాగు చేస్తున్న రైతులను ప్రభుత్వం నిరాదరణకు గురిచేస్తుంది. ఒకవైపు తమలపాకు తోటల సాగు చేయటానికి పెట్టుబడులు పెరుగుతున్నాయి తప్ప.. తమలపాకులకు ధరలు పతనమై గత ఏడాదిగా నిలకడగా ఉండటం.. క్రమేపి పెట్టుబడులు పెరగటంతో రైతులు నిరాశ నిస్పృహలతో ఉన్నారు . ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలు, తెగుళ్ళ రైతులను దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఎలాంటి పరిహారం ఇవ్వకపోగా, బ్యాంకుల్లో తోటల సాగుకు అవసరమైన రుణాలు కూడా కౌలు రైతులకు అందని దీనస్థితిలో ఉన్నారు. ప్రభుత్వాల నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో నిరుద్యోగులు, ఆదర్శ యువ రైతులు తమలపాకు సాగు చేయటానికి ముందుకు రావడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన శాఖకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, తమలపాకు తోటల రైతులను విస్మరించడంపై సర్వత్ర నిరసన వ్యక్తం అవుతుంది.





అవిశ తోటలో పని చేస్తున్న వ్యవసాయ కూలీలు

రైతులకు భారంగా సాగు

తమలపాకు తోటల సాగు చేయటానికి ఎకరానికి కౌలుతో సహా రెండు లక్షల రూపాయలు పెట్టుబడి అవుతుందని రైతులు తెలిపారు. ఎకరానికి కౌలు 50 వేలు సంవత్సరానికి అవుతుంది. మిగిలిన 1.50 లక్షలు అవిశ తోటకు, తీగల కొనుగోలు, నాటు, అవిసె తోట గాలులకు పడిపోకుండా చుట్టూ పెండే కర్రలు కట్టటానికి, చాళ్ల చేయటానికి కూలీ ఖర్చులు అవుతున్నాయని రైతులు తెలి పారు.

పతనమైన తమలపాకుల ధరలు

ఆరుగాలం కష్టించి పండించిన తమలపాకులకు గత ఏడాది నుంచి ధరల్లో మార్పు లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. 100 పంతాల ధరలు రూ.వెయ్యికి మించి పలకడం లేదని పొన్నూరు ప్రాంత రైతులు తెలుపుతన్నారు. ఇతర రాష్ట్రాలకు తమలపాకులు ఎగుమతి పొన్నూరు మార్కెట్ నుండే జరుగుతుంది. తమలపాకుల ధరలు కుదేలు అవటంతో గత రెండేళ్లుగా ఎగుమతులు పూర్తిగా పడిపోయాయి.

సబ్సిడీపై ఎరువులు, విత్తనాలివ్వాలి

చుక్క శివన్నారాయణ, రైతు, ఆలూరు.



తమలపాకు తోటల రైతులను ప్రతికూల వాతావరణం పరిస్థితులు కంగదీస్తున్నాయి. చీడపీడలు , తెగుళ్లు కూడా తోడై తమలపాకుల దిగుబడి తగ్గిపోతుంది. దీనివల్ల తమలపాకుల నాణ్యత లేకపోవడంతో ధరలపై ప్రభావం చూపుతుంది. తమలపాకు తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సబ్సిడీకి అందజేయాలి.

బ్యాంకుల ద్వారా కౌలు రైతులకు రుణ సౌకర్యం కల్పించాలి

బాల కోటిరెడ్డి, తమలపాకు కౌలురైతు, ఆలూరు.



తమలపాకు తోటలు సాగు చేసే కౌలు రైతులకు కౌలు రైతు కార్డులు మంజూరు చేసి జాతీయ బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరిహారం అందించాలి. తమలపాకు తోటలు సాగు చేసే రైతులకు బడ్జెట్లో ఉద్యాన శాఖకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. చింతలపూడిలో తిరిగి తమలపాకు పరిశోధన కేంద్రాన్ని పునః ప్రారంభించి రైతులను ఆదుకోవాలి.

ఉపాధి హామీలో తమలపాకు సాగు పనులు

పీటా.ఉష , హార్టికల్చర్ ఆఫీసర్, పొన్నూరు



తమలపాకు తోటల అభి వృద్ధికి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం వర్తింప చేయాలని ప్రభుత్వా నికి ప్రతిపాదన పంపి ంచడం జరిగింది. ప్రస్తుతం రైతుల కు యాంత్రీకరణ కింద పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు, దమ్ము చేసుకునేందుకు చిన్న ట్రాక్టర్లు సబ్సిడీపై అందజేస్తున్నాము. ఉపాధి పథకం కింద తమలపాకు తోటల అభివృద్ధికి నిధులు మంజూరు అయితే రైతులకు లబ్ధి చేకూరుతుంది.

తాడేపల్లిలో ఘనంగా కృష్ణాష్టమి

ప్రజాశక్తి-తాడేపల్లి : పండుగల యొక్క ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తిం చాల్సిన అవసర ముందని ఎంటిఎంసి బాలోత్సవం కోశా ధికారి గాదె సుబ్బారెడ్డి యువతీ యువకు లను కోరారు. యువత సమాజం పట్ల తమ బాధ్యతను గుర్తిం చాలన్నారు. తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ సభకు స్థానిక గణేష్ సేవా సమితి నిర్వాహకులు ఎస్. కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లా డుతూ యువశక్తి మంచి మార్గంలో నడిస్తే సమాజ మార్పు తథ్యమ న్నారు. తల్లిదండ్రులు పిల్లలు సెల్ ఫోన్‌కు బానిసలు కాకుండా చూడాలన్నారు. చుట్టుపక్కల జరుగుతున్న పరిణా మాలను యువత గమనించి మంచి వైపు పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సేవా సమితి నిర్వాహకులు పాల్గొన్నారు.

నెహ్రూబొమ్మ సెంటర్‌లో...

తాడేపల్లి నెహ్రూ బొమ్మ సెంటర్‌లో జరిగిన కృష్ణా ష్టమి వేడుకలు అంబరాన్ని అంటాయి. సాయంత్రం జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో వందలాది మంది యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు వేల మందికి అన్నదానం నిర్వహించారు. అన్న దానం కార్యక్రమాన్ని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు నిర్వా హకులు పురాణం వెంకటాచార్యులు ప్రారంభించారు.



కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వ రరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, దొంతిరెడ్డి వేమారెడ్డి, బి.వేణుగోపా లసోమిరెడ్డి, ఇ.డేవిడ్‌రాజు, సింకా గంగాధరరావు, తాడిబోయిన నాగేశ్వ



రరావు, దానబోయిన సుందర రావుయాదవ్, వల్లభనేని వెంకట్రావు, టి.బాబు, సూరయ్య పాల్గొన్నారు.

మహానాడు 14వ అడ్డరోడ్డులో శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు ఏడు వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య, పి.వెంకటేశ్వర్లు, శ్రీను, రమణయ్య, పి.చెన్నయ్య, డి.విజయ్, ఎ.నాగ ొరాజు, ఎ.పెద్దఆంజనేయులు, పి.ఏడుకొండలు, జి.ఆంజనేయులు తది తరులు పాల్గొన్నారు.



అరవింద స్కూల్ వద్ద రోడ్డుపై గుంపులుగా ఉన్న వీధి కుక్కలు

వీధికుక్కలతో బెంబేలు

సమస్యను పరిష్కరించాలని కోరుతున్న మంగళగిరి వాసులు

ప్రజాశక్తి - మంగళగిరి

వీధికుక్కలతో బెంబేలెత్తుతున్న మంగళగిరి పట్టణ వాసులు. గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పాదచారులను ద్విచక్ర వాహనదారులు వెంట పడుతూ అరుస్తూ కొరుకుతున్నాయని నగరవాసులు భయందోళనకు గురవుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు చిన్న చిన్న గల్లీ రోడ్లలో అధికంగా ఉంటూ, ప్రత్యేకించి వీధి కుక్కలను చూసి భయపడుతున్న చిన్నారులను వెంటబడి కరుస్తున్నాయి. దీంతో నగరంలో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మంగళగిరి నిడమర్రు రోడ్డులో గల అరవింద స్కూల్ వద్ద స్కూలుకు వస్తున్న పిల్లలు భయబ్రా ంతులకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా బాప్టిస్ట్ పేట, భార్గవ్ పేట, పాత మంగళగిరి, కొత్తపేట, బ్యాంక్ కాలనీ, పార్క్ రోడ్డు, ద్వారకా నగర్, ఇందిరా నగర్, పాత మంగళగిరి, మంగళగిరి నగరంలోని అన్ని ప్రాంతాలలో గుంపులు గుంపులుగా వీధి కుక్కలు రోడ్డుపైకి చేరి అరవటం, పోట్లాటుకుంటూ అదే సమయంలో పాదచారులు మోటార్ బైక్ పై వెళ్లే వారిపై వెంటపడి కరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి అని నగర వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కార్పొరేషన్ అధికారులు సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



నివాళి అర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

మధర్ థెరిస్సాకు మానవతా సంస్థ నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మానవ సేవకు ప్రతిరూపమైన మదర్ థెరీసా జయంతి సందర్భంగా గుంటూరు లక్ష్మీపురంలోని మదర్ థెరీసా విగ్రహం వద్ద సేవామూర్తికి ఘనంగానివాళులు అర్పించారు. యుగేస్లావియాలో జన్మించిన మదర్‌థెరీసా భారతదేశంలో స్థిరపడి పేద ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందించారని మానవత చైర్మన్ పావులూరి రమేష్ తెలిపారు. అతిచిన్న వయసులోనే సన్యాసినిగా మారి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి కలకత్తాలో భయంకరమైన వ్యాధులు సోకిన నిరుపేదలు, అభాగ్యులకు తన సేవల ద్వారా జీవితాన్ని ప్రసాదించారని, ప్రపంచంలోని 123 దేశాల్లో 610 శాఖలతో మిషన్ ఆఫ్ చారిటీస్ తరపున అనేకమంది పేద ప్రజలకు సేవలు అందించి నోబెల్ శాంతి బహుమతి, భారతరత్న లాంటి అవార్డులు అందుకున్నారని కార్యదర్శి కె.సతీష్ తెలిపారు. నిర్మల్ హృదయ సిస్టర్స్‌తో పాటుగా మానవత కోశాధికారి టీవీ సాయిరాం, పి.సుధాకర్, అనంతరామయ్య, విజయలక్ష్మి, సురేష్, ఉమామహేశ్వరరావు తదితరులు మదర్ థెరీసాకు నివాళులు అర్పించారు.



సామూహిక శ్రీమంతాలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వరల్డ్ వెల్ బీయింగ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సాంబేలు శాంతి బాయి, వైస్ చైర్మన్ తన్నీరు నరసింహారావు సారథ్యంలో మాచర్ల పట్టణంలోని జయంతి నగర్ లోని కడు పేదవారికి ఆహార పంపిణీ తో పాటుగా పేద గర్భిణీ మహిళలకు సామూహిక శ్రీమంత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లాజరస్ నరసింహులు ,మెట్టు గోవింద్ రెడ్డి,కాశీ నిరీక్షణ్ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు శాంతి బాయి గారు చేస్తున్న నిస్వార్థ సేవలను చూసి ఎంతో అభినందించారు.

బాలకృష్ణస్వామి దేవాలయంలో పూజలు

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు మండలం చెంఘీజ్ ఖాన్ పేట గ్రామంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీవెన్నముద్ద బాలకృష్ణస్వామి దేవాలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సుప్రభాత సేవ , నవనీత హారతి, స్వామి వారికి పంచామత అభిషేకం, నిజరూప దర్శనం, విశేష అలంకరణ, విశేష సంతాన వేణుగోపాల మూలమంత్ర హోమం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర సహిత సహస్రనామ పూజలు చేశారు. ప్రాత్ణకాలం నుంచే నరసరావుపేట భజన సమాజం వారిచే విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణం పటించారు.

ముగిసిన పవిత్రోత్సవాల పూర్ణాహుతి

ప్రజాశక్తి - అమరావతి

పంచారామాల్లో ప్రథమశైవక్షేత్రంగా విరాజిల్లుతున్న అమరావతిలో వేంచేసి ఉన్న శ్రీ బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో గత రెండు రోజులుగా జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాల కార్యక్రమం సోమవారం తో ముగిసింది.గత కొన్ని సంవత్సరాలుగా విజయవాడకు చెందిన యార్లగడ్డ ఉపేంద్ర ధర్మపత్ని విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు అయిన సోమవారం యార్లగడ్డ దంపతుల ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటల నుండి మండప పూజలు, దీక్షా హొూమములు, మండప దేవత హొూమములు, కుష్మాండ హొూమములు, ప్రాయశ్చిత్త హొూమము, పూర్ణాహుతి హొూమ పూజలను ఆలయ ప్రధాన అర్చకుల వేదమంత్రో చరణాలు, మంగళ వాయిద్యాల నడుమ విచ్చేసిన భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అనంతరంఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమరేశ్వర స్వామి వారి కల్యాణ మండపంలో పూర్ణాహుతి కార్యక్రమం పూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులకుఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల ఏర్పాట్లను ఆలయ కార్యవాహన అధికారి వేమూరి గోపి పర్యవేక్షించారు. పూజ కార్యక్రమాలలో ఆలయ స్థానాచార్యులు కౌశిక. చంద్రశేఖర శర్మ, ఆలయ అర్చక స్వామి సుధీర్ శర్మ, ఆలయ అర్చకులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



సీజనల్ వ్యాధుల నుండి పశువులను కాపాడుకుందాం..!

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆదికాలం నుండి వ్యవసాయంలో పశువులు వివిధ రూపాల్లో సహాయం చేస్తున్నాయి. అంతేగాక ముఖ్యంగా పశువు జాతులు (గోమాత, బర్రె, గొర్రె, మేకలు) పాల ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తాయి. పాల ఉత్పత్తులు మనకు ప్రోటీన్, విటమిన్లు అందిస్తాయి. అలాంటి పశువులను వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నుండి కాపాడుకోవడం ఎంతో కీలకం

గాలికుంటు వ్యాధి..

ఆవులు, ఎద్దులు, గేదెలకు ఈ గాలికుంటు వ్యాధి ఎక్కువగా సోకుతాయి. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువుకి నోటిపూత ఏర్పడి మేత సరిగ్గా తీసుకోదు. దీంతో నీరసం వల్ల నడిచేందుకు కష్టపడతాయి. గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి నడిచేందుకు ఇబ్బంది పడతాయి. దీని వల్ల పాలఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యులు సూచనలతో యాంటీబయాటిక్స్, నొప్పుల నివారణ మందులను వాడాలి. కొన్ని సందర్భాల్లో పశువులలో గర్భస్రావమయ్యే అవకాశమూ లేకపోలేదు.

చిటుకు వ్యాధి సోకడం

ఈ వ్యాధి సోకినప్పుడు జ్వరం ఎక్కువగా ఉంటుంది. నివారణ కోసం జులై, ఆగస్టు నెలల్లో ఇటాస్ వ్యాధి నిరోధక టీకా వేయించాలి. మేత పరిమితికి మించి తీసుకోవడం వలన జీర్ణం అవక చిటుకు వ్యాధి సోకుతుంది.

గొంతువాపు:

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైంది. ఈ వ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ కారడం జరుగుతుంది. శ్వాస పీల్చడానికి ఇబ్బంది పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధి నియంత్రణకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు. వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.



వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం అధికం. ఈ వ్యాధులు సాధారణమైనా పాల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. నిర్లక్ష్యం వహిస్తే కొన్నిసార్లు వాటి ప్రాణాలకే ముప్పు. పశువులు వ్యాధులకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెం.1962కి ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవా వాహనంతో వైద్యులే ఇంటికి వచ్చి చికిత్స అందిస్తారు. పాడి రైతులకు ప్రభుత్వం రాయితీలిస్తోంది. రాయితీపై గడ్డి విత్తనాలు, వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా ఇస్తున్నారు.

- పల్నాడు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు

ఎద సమయాన్ని గుర్తించాల్సినవి

వానా కాలంలో చల్లగా ఉండడం వల్ల ఆవులు, గేదెలు ఎదకు వస్తాయి. చలి గాలులు ప్రారంభం అవ్వగానే ఎద లక్షణాలు కనిపిస్తాయి. గేదెలో ఎదకాలం 36 గంటలు ఉంటుంది. గేదెలో ఉదయం, సాయంత్రం ఎద కనిపిస్తే మరసటి రోజు ఉదయం, సాయంత్రం చూలు కట్టాలి.

పశుపోషణ

పచ్చిక బయళ్లలో పెరిగిన గడ్డిన తిన్న పశువులకు తగినంత వేడి అందదు. ఎండు గడ్డి పశువు వయస్సు శరీర దారుఢ్యం బట్టి 6 నుండి 8 కిలోల మేత రోజుకు వేయాలి. నాణ్యమైన దానాన్ని మేతగా ఇవ్వాలి. శుభ్రమైన నీరు 60 నుంచి 70 లీటర్లు, వట్టిపోయిన పశువులకు 40 లీటర్లు తాపాలి.

ఆరోగ్య సంరక్షణ

పశువులు కట్టి వేసే పాకల పరిసరాల్లో మురుగునీరు పాకలకు రంధ్రాలు, లేకుండా చూసుకోవాలి. రంధ్రాలు ఉంటే వర్షకాలంలో వర్షపు నీరు చేరి పశువుల మేత తడిచిపోతుంది. తేమ వల్ల ఈగలు, దోమల ఉధృతి ఎక్కువై పశువుల ఆరోగ్యం దిబ్బతినే ప్రమాదం ఉంటుంది. పశువుల పాకలలోకి గాలి వెలుతురు బాగా ఉండేలా నిర్మాణం చేయడం మంచిది. ఈగలు, దోమల నివారణకు మందులు పిచికారీ చేసుకోవాలి. దోమ తెరలు వినియోగించాలి. తడిచిన మేత వేయకూడదు. పోషక విలువలు కలిగిన సమతుల్య దాణా, పోషకాల మిశ్రమాన్ని ఇవ్వాలి.



ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



ప్రజాశక్తి - వినుకొండ

మెయిన్ బజార్లో శ్రీవివేకానంద హైస్కూల్ ఆవరణలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు కనుల పండవగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాఠశాల డైరెక్టర్ సయ్యద్ ఆరిఫ్ విచ్చేశారు. తల్లిదండ్రులు ఎలిమెంటరీ స్థాయి పిల్లలచే కులాలకి మతాలకి అతీతంగా పిల్లల చేత కృష్ణుని, గోపికల వేషధారణలతో ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి అంజి షకీరా తదితరులు పాల్గొన్నారు



ప్రజాశక్తి - వినుకొండ


పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో శ్రీసంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని వైభవంగా జరిగినది టిడిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు ఆలయ ధర్మకర్త శ్రీకనపర్తి వెంకట్రావు ఆధ్వర్యంలో కృష్ణుని గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు కార్యక్రమం మాజీ శాసనసభ్యులు మక్కిన మల్లికార్జున రావు ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన ఉట్టి కార్యక్రమంలో పాల్గొని భక్తులందరినీ అలరించారు తదుపరి శ్రీదత్త వెంకటేశ్వర మహిళ కోలాటం నిర్వహించారు ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ఆధ్వర్యంలో కృష్ణునిగుడికి ఆవులు ఎంతో ముఖ్యమని అందులో భాగంగా దేవస్థానానికి ప్రభుత్వ స్థలము రెండు ఎకరాల నుండి మూడు ఎకరాల వరకు ఏర్పాటు చేస్తామని అన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక వెన్నపూస కాలనీ, గీతాంజలి రెసిడెన్షియల్ స్కూల్లో శ్రీ కష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా డైరెక్టర్ వై.శేషగిరిరావు విచ్చేసి చిన్నారులకు కష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ టి.కృష్ణవేణి మాట్లాడుతూ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యాసంవత్సరం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం చిన్నారులు ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో కారాస్పాండంట్ వై. యల్. కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ సోమవారం స్థానిక శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించగా ఆయనకు ఆలయ ధర్మకర్త ముప్పా వెంకటేశ్వరావు ఘన స్వాగతం పలికారు. ఫ్లైటెక్ ఏవియేషన్ కెప్టెన్ మమత,నేరేటి వీరాస్వామి యాదవ్,గుండాల శ్రీనివాస్ యాదవ్,గోపి,రాజబోయిన మధు,గుమ్మా వెంకటేశ్వర్లు, వస్తుపూరి శ్రీరామూర్తి, తగుళ్ళక్రిష్ణ, అయినబోయిన శ్రీను,వెంకట సుబ్బయ్య, బాలరాజు పాల్గొన్నారు.



ఘనంగా మదర్‌థెరిస్సా జయంతి



గుమ్మడి వృద్ధాశ్రమంలో

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులందరూ మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుతున్న గుమ్మడి దంపతులకు, వినుకొండ నియోజకవర్గ ప్రజానీకానికి ఆశ్రమానికి, సహాయ సహకారాలు అందజేస్తున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్‌లో సెయింట్ మదర్‌థెరిస్సా విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సెయింట్ మదర్ థెరిస్సా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మథర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశానికి తెలుగు సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడారు. మదర్ థెరిస్సా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ అధినేత డాక్టర్ నాగోతు ప్రకాశరావు ఆధ్వర్యంలో 200మందికి అల్పాహారం పంపిణీ చేశారు. మదర్ థెరిస్సా విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు అనన్య హాస్పిటల్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలోని 100 మంది గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. సెయింట్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వంకాయలపాటి రవి, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు మిట్టపల్లి రమేష్,గర్నెపూడి అలెగ్జాండర్, రాయల శ్రీనివాసరావు,పాదర్తి ప్రసాద్, భాగవతుల లక్ష్మీ నారాయణ, కొట్టా కిరణ్,క్రాంతి కుమార్,గుత్తా అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

మదర్‌థెరిస్సా చేసిన సేవలు ఆదర్శనీయమని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. మదర్‌థెరిస్సా జయంతి నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఆమె విగ్రహనికి మదర్‌థరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథి పోలూరి నరసింహారావు మాట్లాడుతూ మదర్‌థెరిస్సా పేదలకు సేవలందించారన్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు గాదె కిరీటిరెడ్డి, ప్రతినిధులు సిహెచ్ నాగిరెడ్డి, ముత్యాల పాపిరెడ్డి, అందుగుల చంద్రయ్య, కసిరెడ్డి శాంతిరెడ్డి, జె శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేధిక నాయకులు కేళం ఆదినారాయణ, పాండురంగారావు, సీనియర్ ప్రాతికేయులు ఉప్పుతోళ్ళ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావును మదర్‌థెరిస్సా సభ్యులు ఘనంగా సన్మానించారు.

రోజుల తరబడి పడిగాపులు

ఉచిత ఇసుకపై పెదవి విరుపు

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రభుత్వం తీసుకొస్తామన్న ఉచిత ఇసుక విధానంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉన్న ధరకు, ప్రస్తుతం ప్రభుత్వం సరఫరా చేస్తున్న ధరకు పెద్ద తేడా లేదని అటు నిర్మాణదారులతో పాటు వాహన యజమానులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇసుక టోకెన్లు తీసుకోవడానికే రెండు రోజుల సమయం వెచ్చించాల్సి వస్తుందని వాపోతున్నారు. తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆన్‌లైన్ బుకింగ్ కోసం రోజుల తరబడి పడిగాపులు కాయడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల తాము రెండు రోజులు పని దినాలు నష్టపోవాల్సి వస్తుందని లారీ యజమానులు వాపోతున్నారు. ఆన్‌లైన్‌లో లారీ ఇసుకకు రూ.2500 చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు. అక్కడ నుంచి జిల్లాలో ఏర్పాటు చేసిన తాళ్లాయపాలెం, వెంకటపాలెం రెండు రీచ్‌లకు వెళ్లి ఇసుక తెచ్చుకోవాల్సి వస్తుందని తెలిపారు. డ్రైవర్ ఇందుకోసం వినియోగిస్తే ఒక లారీ ఇసుక రీచ్ నుంచి బయటకు రావడానికి మూడు రోజుల సమయం పడుతుందని, దీని వల్ల డ్రైవర్‌కే రూ.3 వేలు చెల్లించాల్సి వస్తుందని ఓనర్లు చెబుతున్నారు. లారీ ఇసుక వినియోగదారుడికి వెళ్లే సరికి రూ.7500 నుంచి రూ.8 వేల వరకు వసూలు చేయాల్సి వస్తుందని



తహశీల్దార్ కార్యాలయం వద్ద లారీ డ్రైవర్లు

వాహనదారులు అంటున్నారు. ఇసుక ధరలు గత ప్రభుత్వం మాదిరిగానే ఉన్నాయని పెద్దగా తేడా కనిపించడంలేదని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ కావడం నదులకు పెద్దఎత్తున వరద రావడంతో జిల్లాలో మరిన్ని రీచ్‌లు పెరగడానికి అవకాశం లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారు. అధికారులు చెప్పిన దాని ప్రకారం వచ్చే నవంబర్ వరకు ఉచిత ఇసుక లేనట్టేనని భావిస్తున్నారు. అప్పటి వరకు ధరలు ఇలానే ఉంటాయని అటు వినియోగదారులు, ఇటు వాహన యజమానులు కూడా భావిస్తున్నారు.

ఏకాగ్రతకు స్ఫూర్తిప్రదాత ఏకలవ్యుడు

ప్రజాశక్తి-తాడేపల్లి

కార్యదీక్షకు, ఏకాగ్రతకు స్ఫూర్తిప్రదాత ఏకలవ్యుడని పలువురు గిరిజన నాయకులు కొనియాడారు. ఎంటిఎంసి తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు సోమవారం ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేసిన 25 సంవత్సరాలు అయిన సందర్భంగా పట్టణంలో గిరిజన నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చరిత్ర పుటల్లో కొందరు మహనీయులకు సరైన గౌరవం దక్కలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకలవ్యుడి జీవితాన్ని పాఠ్యాంశంగా పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. విలువిద్యలో ఏకలవ్యుడిని మించిన గొప్ప వ్యక్తి లేడని కొనియాడారు. నేటి సమాజంలో త్యాగాలకు విలువ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏకలవ్యుడి త్యాగనిరతి, పట్టుదల చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, యు.బాబు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, టి.రాఘవులు, కె.కన్నారావు, శివశంకరరావు, సుబ్బారావు, కల్యాణ్,



సిహెచ్.సాంబయ్య, ప్రసాద్, జి.శ్రీను, ఎం.జోజి, రజనీకాంత్, పి.దుర్గారావు పాల్గొన్నారు.

100 కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజి శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి టౌన్, మంగళగిరి రూరల్ లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 100 మంది మహిళలకు సోమవారం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు మహిళలు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 62వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 100 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఊట్ల దుర్గా మల్లేశ్వరి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, పట్టణ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి వాసా పద్మ, మండల తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి అప్పల శాంతి, నియోజకవర్గ తెలుగు మహిళా అధికార ప్రతినిధి యలమంచిలి పద్మజ, నియోజకవర్గ అంగన్వాడీ సెల్ కార్యదర్శి దివిలక్ష్మి, పట్టణ తెలుగు మహిళా కార్యదర్శి ఉడతా లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్ లను ఉచితంగా మహిళలకు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

గ్యాస్ వినియోగదారుల సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువులో ఉన్న సఖీ పాయింట్ గ్యాస్ వినియోగదారులు దోపిడీ గురవుతున్నారని కారంపూడి అంకమ్మరావు సోమవారం మంగళగిరి పట్టణంలోని రాయల్ గ్యాస్ యాజమాన్యానికి వినతి పత్రం అందజేశారు. సఖి పాయింట్ గ్యాస్ వినియోగదారులను యాజమాన్యం అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతుందని తెలిపారు. బిల్ ధర 825.50 ఉందని, అదనంగా 75 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లుగా తెలిపారు. అదేవిధంగా గోడెన్ ఇంచార్జ్ రమేష్ గ్యాస్ వినియోగదాల నుండి బిల్లు తీసుకొని వెళ్లినప్పటికీ పది రూపాయలు అదనంగా తీసుకొని గ్యాస్ ఇస్తున్నారని దీనిపై ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. యాజమాన్యం స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు.

యాజమాన్యం వివరణ

సఖి పాయింట్ వారు సోమవారం నుండి తమ ప్రాంతాల్లోని కస్టమర్ల బుకింగ్ వారే చేసి, ఎన్ని బుకింగ్ ఉన్నాయో అన్ని రీఫిల్ సిలిండర్లు మాత్రమే సప్లై చేయబడుతుందని రాయల్ గ్యాస్ యాజమాన్యం తెలిపారు. విత్‌అవుట్ బుకింగ్ మాన్యువల్ లేనందున, సఖి పాయింట్ వారే పంచింగ్ చేయవలెనని తెలిపారు. అదనంగా డబ్బులు వసూల చేయడం లేదని తెలిపారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తెనాలి

రూరల్ గ్రామం అంగలకుదురు ఎస్టీ కాలనీలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. గ్యాస్ స్టౌవ్ లీకేజి కారణంగా సంభవించిన ప్రమాదంలో బణావత్ సీతకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు సకాలంలో స్పందించటంతో ప్రమాదం ఒక ఇంటికే పరిమితమైంది. ఇంట్లోని వస్తువులు, వస్త్రాలతో సహా అగ్నికి ఆహుతి కావటంలో బాధితురాలు కట్టుబట్టలతో మిగిలింది. పశువులకు గాని, మనుషులకు ఎలాంటి ప్రమాదం లేకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ ఘటనా స్థలికి చేరుకున్నారు. బాధితురాలితో మాట్లాడారు. తక్షణ సాయం రూ.5వేలు ఆర్థిక సాయాన్ని, నిత్యావసరాలను ఆమెకు అందజేశారు. పంచాయతి ఉపసర్పంచ్ కూడా స్పందించి తక్షణ సాయంగా రూ.5వేలను ఆమెకు అందించినట్లు తహశీల్దార్ తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బాధితురాలిలో మాట్లాడుతున్న తహశీల్దార్ గోపాల కృష్ణ

కెఎల్ యూనివర్సిటీ దత్తత గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ దత్తత గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.చక్రవర్తి కోరారు. సోమవారం ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ విభాగం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా, వంటి సీజనల్‌గా వచ్చే జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో విజయవాడకు చెందిన మిత్రా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్, అమరావతి నేత్ర వైద్యశాల, వెంకట రమణ దంత వైద్యశాల వైద్యులు ప్రజలకు ఉచితంగా రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, నేత్ర, దంత వైద్య పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సలహాలు అందచేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కెఆర్ఎస్. ప్రసాద్ తెలిపారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, ఖాళీ కొబ్బరి బోండాలు, టైర్లు, వాడని నీటి తొట్టెలు తొలగించాలని, దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలను వాడాలని, శుభ్రమైన నీరు, పౌష్టికాహారం భుజించాలని, మూడు రోజుల కంటే ఎక్కువ జ్వరం ఉంటే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఫార్మశీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. సుప్రియ ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిభిరం నిర్వహణకు వడ్డేశ్వరం గ్రామ పెద్దలు కత్తిక మల్లిఖార్జునరావు (బుల్లెబ్బాయ్) సహకారం అందచేశారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కత్తిక మల్లిఖార్జున రావు, వైద్యులు సంషుద్దీన్ తదితరులు

వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఏవిఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, విద్యార్ధి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మన పొన్నూరు వెల్ఫేర్ ఆసోసియేషన్ సభ్యులకు ఎపిజె అబ్దుల్‌కలాం పురస్కారం

ప్రజాశక్తి - పొన్నూరు





పొన్నూరు పట్టణంలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖ రక్తదాన, అన్నదాన చైతన్యకర్త, మన పొన్నూరు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సామాజిక సేవ చేస్తున్న తిరుమల శెట్టి ఉమాశంకర్, కార్యవర్గ సభ్యులు చిలకపాటి సింహాద్రిలకు ఎపిజె అబ్దుల్‌కలాం జాతీయ సేవా పురస్కారం లభించింది. సోమవారం విజయవాడకు చెందిన మదర్ సర్వీసెస్ సొసైటీ రెండో వార్షికోత్సవ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు కళా కేంద్రంలో జాతీయ సేవ పురస్కారం సంస్థ అధ్యక్షులు మల్లాది ప్రసాద్ రావు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు ఉమాశంకర్, సింహాద్రి మాట్లాడుతూ తాము అందుకున్న పురస్కారం మాకు తోడ్పాటు అందించిన రక్తదాతలకు, అన్నదాతలకు, సభ్యులకు చెందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తన సేవలు గుర్తించిన మదర్ సర్వీస్ సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు విజయవాడలో సిపిఐ భూ సదస్సు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో భూ ఆక్రమణలు, అన్యాక్రాంతాలు, భూ దందాలను వ్యతిరేకిస్తూ ఈనెల 28న సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడ దాసరి భవన్‌లో భూ బాధితుల రాష్ట్ర సదస్సు నిర్వహించునున్నట్లు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తెలిపారు. సోమవారం మంగళగిరి పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సదస్సుకు నియోజకవర్గంలో ఉన్న భూ బాధితులు తరలి రావాలని తిరుపతయ్య పిలుపు నిచ్చారు. గోడ ప్రతులు ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, బి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న గూడరు వెంకట్రావు తదితరులు

250మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - దుగ్గిరాల

పుస్తకాలు పిల్లలకు ఉపయోగపడతాయి.. నా వద్దకు ఎవరు వచ్చినా శాలువాలు బొకేలు వద్దు పుస్తకాలు తీసుకు రమ్మని మంత్రి నారా లోకేష్ కోరిక మేరకు ఆయన పెళ్లిరోజు సందర్భంగా సోమవారం పలువురు విద్యార్థులకు టిడిపి నాయకులు పుస్తకాలు పంపిణీచేశారు. సోమవారం దుగ్గిరాలలోని అన్న క్యాంటీన్ వద్ద టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు తదితరులు నారా లోకేష్ బ్రాహ్మణి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి 250 మంది పాఠశాల విద్యారినీ,విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు, ఇన్సాన్ గ్యాస్ ఏజెన్సీస్ అధినేత గద్దె శ్రీనివాస్ మాట్లాడుతు శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. గత 217 రోజుల నుండి ఒక్కరోజు కూడా విరామం లేకుండా అన్న క్యాంటీన్ ను సొంత నిధులతో నిర్వహిస్తూ పేదలకు కడుపునిండా అన్నం పెడుతున్న మంత్రి నారా లోకేష్ దంపతులను ఆశీర్వదించారు. వారి పెళ్లి రోజు సందర్భంగా అన్న క్యాంటీన్లో స్వీటు హాటు బిర్యాని పెరుగన్నంతో పేదలకు ప్రత్యేక భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు వల్లూరు నరసింహారావు, కొరటాల సురేష్, పర్వతనేని హర్షవాసిరెడ్డి సుధాకర్, నక్క చిరంజీవి షేక్ బాషా ఏడుకొండలు చంటి తదితరులు పాల్గొన్నారు.



సిఎంఎ ఫలితాల్లో ఆలిండియా మొదటి ర్యాంక్ సాధించిన సందర్భంగా

మాస్టర్‌మైండ్స్ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - గుంటూరు

'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' ఇటీవల ప్రకటించిన సిఎంఎ ఫైనల్ పరీక్షా ఫలితాల్లో 'మాస్టర్ మైండ్స్' విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్, 3వ ర్యాంక్, 8వ ర్యాంక్‌తోపాటు సిఎంఎ ఇంటర్ ఫలితాల్లో ఆల్ ఇండియా 3వ ర్యాంక్, 9వ ర్యాంక్ సాధించి చరిత్ర సృష్టించారు. ఈ విజయంతో మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థ కామర్స్ కోర్సుల ఫలితాల్లో మరోమారు తన నంబర్ 1 స్థానాన్ని పదిలం చేసుకుందని మాస్టర్ మైండ్స్ క్యాంపస్ ఇన్‌ఛార్జ్ వై.శ్రీనివాసరావు (వై.ఎస్.ఆర్) అన్నారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీని ఆంజినేయ విజయ్ కుమార్‌తో కలిసి వై.శ్రీనివాసరావు ప్రారంభించారు. విద్యాసంస్థ ప్రాంగణం నుండి బైక్ ర్యాలీగా బయలుదేరి శంకర్ విలాస్, లాడ్జి సెంటర్ మీదగా ర్యాలీని కొనసాగించారు. క్యాంపస్ వద్ద బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. విద్యార్థులతోపాటు ఇలాంటి విజయసాధనకు కారణమైన అధ్యాపకులు, సిబ్బందిని, విద్యార్థుల తల్లిదండ్రులను మాస్టర్ మైండ్స్ యాజమాన్యం అభినం దించింది.


మాస్టర్ మైండ్స్ భారీ ర్యాలీ

స్కాలర్‌షిప్‌లకు పోస్టల్ శాఖ దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టల్ శాఖ నిర్వహించే ఫిలాటలీ స్టాంప్ కలెక్షన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించటంలో భాగంగా దీన్ దయాళ్ స్పర్ష్ యోజన-2024 ఫిలాటలీ స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేయనున్నట్లు గుంటూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ యు.యలమందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని, పాల్గొనే వారు 2023-24 విద్యాసంవత్సరంలో 60శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. ప్రతి తరగతి నుండి 10 మంది విద్యార్థుల చొప్పున నాలుగు తరగతుల నుండి 40 మందిని ఎంపిక చేసి వారికి ప్రతి నెలా రూ.500లు చొప్పున సంవత్సరానికి రూ.6వేలు స్కాలర్‌షిప్ అందిస్తారన్నారు. మొదటి విభాగంలో సెప్టెంబర్ 30న రీజనల్ స్థాయిలో ఒక ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 50 ప్రశ్నలకు 50 మార్కుల పల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయని ఇందులో కరెంటు అఫైర్స్, హిస్టరీ, సైన్స్, స్పోర్ట్స్, జాగ్రఫీల్లో ఒక్కో సబ్జెక్టుకు 5 మార్కుల చొప్పున, లోకల్ ఫిలాటలీలో 10 మార్కులు, నేషనల్ ఫిలాటలీలో 15 మార్కుల చొప్పున ఉంటాయన్నారు. మొదటి విభాగంలో ఉత్తీర్ణులు అయిన వారికి రెండో విభాగంలో ఫిలాటలీ ప్రాజెక్ట్ పరీక్ష నిర్వహిస్తారని, దీనిలో 5 పేజీలు, 500 పదాలు, 16 స్టాంపులు మించకుండా ఒక ప్రాజెక్ట్ సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు పాల్గొంటారో వారి పేర్లు నమోదు చేసి, స్కూల్ నుండి పోస్టర్ మాస్టర్ జనరల్ విజయవాడ-520003 వారికి ఫిలాటలి స్టాంప్స్ అతికించి సెప్టెంబర్ 16లోపు చేరేలా స్పీడ్ పోస్ట్ ద్వారా పంపించాలని తెలిపారు.


ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు

బిఆర్ స్టేడియంలో ఫిట్‌నెస్ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-గుంటూరు

నేషనల్ స్పోర్ట్స్‌డే సందర్భంగా సోమవారం స్థానిక బిఆర్ స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిబ్బంది, శిక్షకులు, క్రీడాకారులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. చురుకైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోవటానికి, శరీర ధారుఢ్యం, ఆరోగ్యం కోసం ప్రతిరోజూ 30 నిముషాలు కేటాయిస్తానని, కుటుంబ సభ్యులు, స్నేహితుల్ని ఫిట్‌గా ఉంచటానికి కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో 27, 28 తేదీల్లో హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ బాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్, అథ్లెటిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆయా క్రీడల కోచ్‌లను సంప్రదించాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆఫీసుల్లో పనిచేస్తున్న సిబ్బంది కోసం 35 ఏళ్లలోపు వారికి 400 మీటర్స్ వాక్, వందమీటర్ల వాక్, 60 మీటర్ల రన్, బాడ్మింటన్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

సెప్టెంబర్ 25న చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించటానికి సైన్స్ పట్ల ఆసక్తి, ప్రశ్నించే తత్వం పెంపొందించటానికి జెవివి ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జెవివి గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25న, మండల స్థాయిలో అక్టోబర్ 1న, జిల్లా స్థాయిలో అక్టోబర్ 27న రాష్ట్ర స్థాయిలో నవంబర్ 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 34 సంవత్సరాలుగా విజయవంతంగా ఈ సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి, చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనేటట్లు చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో బి.ప్రసాద్, టి.జాన్‌బాబు, ఎ.ఎస్. ప్రసాద్, జి.వెంకటరావు, బి.ఉదయ భాస్కర్, బి.శంకర్‌సింగ్, ఎండి.అక్బర్, సుభాని, ఇ.అనిల్‌కుమార్, టి.ఆర్.రమేష్, టి.ఆర్. చాందిని, యం.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, తదితరులు


పాతగుంటూరులో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్


తెనాలిలో అన్నదానంలో పాల్గొన్న ఆలపాటి

సేవను ప్రోత్సహించటమే పండుగల పరామర్ధం : ఎమ్మెల్యే నసీర్

జిల్లాలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

సమాజంలో పరస్పర సంబంధాలు మెరుగు పరుచుకుంటూ పది మంది ప్రయోజనం కోసం పాటుపడాలనే సందేశమే పండుగల పరమార్థం అని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పాత గుంటూరులోని పలు చోట్ల జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, మీరావలి, కూరాకుల ప్రభాకర్, కందుకూరి వెంకట్, చావలశ్రీను, ఎల్లవల్లి వీరరాజు, అల్లంబాజీ, సుబ్బారావు, రియాజ్, మహంకాళి నరసింహారావు, కె.పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమేధ విద్యా సంస్థల్లో కృష్ణాష్టమి

ప్రజాశక్తి-గుంటూరు :శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శ్రీమేధ బ్రాడీపేట క్యాం పస్‌లో సోమ వారం వైభవంగా నిర్వ హించారు. కళాశాల ప్రాంగణం ఎదుట ఉట్టి కొట్టే కార్యక్ర మాన్ని విద్యార్థుల కోలాహలం మధ్య సంస్థ డైరెక్టర్ అన్నా నందకిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నందకిషోర్ కృష్ణుడి జన్మవృత్తాంతాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులు ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహ ంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఉట్టికొడుతున్న సంస్థ డైరెక్టర్ అన్నా నందకిషోర్

తెనాలి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలి : స్థానిక గంగాన మ్మపేటలోని శ్రీ కృష్ణ మందిరంలో సోమ వారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. ప్రజలకు కృష్ణాష్టమి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఇస్కాన్ టెంపుల్‌లో వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక శ్యామలానగర్ రైల్వే గేటు వద్ద, మల్లారెడ్డి నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో జనచైతన్య ఆధ్యాత్మిక కంద్రం, జనచైతన్య హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన మాదల రత్నగిరిబాబు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదల రత్నగిరిబాబు, మాదల సునీత, మాదల చైతన్య, మాదల మీనారత్న, మాదల శ్రీరామ్ భాస్కర్, డాక్టర్ పాటిబండ్ల శివాజీ, డాక్టర్ మాదల పూజ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంరతం ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

షాప్‌హైర్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక లక్ష్మీపురంలో షాప్‌హైర్ క్లినిక్‌ను ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బోడే ప్రసాద్, భాష్యం ప్రవీణ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజల్వనను ఎమ్మెల్యే గల్లా మాధవి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణస్వామి, డాక్టర్ ఓ.వి.రమణ శుభాకాంక్షలు తెలిపారు. వైద్యులు పి.రమణి, మద్దిరాల నవీన, గారపాటి ప్రియాంక, కన్యధారి మౌనిక తదితరులు క్లినిక్ ప్రత్యేకతలను వివరించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ పేదవారికి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి క్లినిక్స్ మరిన్ని రావాలన్నారు. ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, భాష్యం ప్రవీణ్ క్లినిక్ వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



ఘనంగా రాయపాటి ఓవర్సీస్ 3వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాయపాటి ఓవర్సీస్ 3వ వార్షికోత్సవం సందర్భంగా రాయపాటి ఓవ్సీఎస్ లో వార్షి కోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, గల్లా మాధవి, నసీర్ మహమ్మద్ టిడిపి యువనాయకులు మన్నెం శివ నాగ మల్లేశ్వరావు (మల్లిబాబు) జిల్లా తెలుగు విద్యార్థి అధ్యక్షులు మన్నవ వంశీ కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన మూడు సంవత్సరాలలో సుమారు 800 విద్యార్థులను ఇతర దేశాలకు పంపి వారికి కావలసిన అడ్మిషన్ ప్రాసెస్, లోన్ ప్రాసెస్ అంత చాలా పకడ్బందీగా చేసి రాష్ట్రంలోనే వన్ ఆఫ్ ది బెస్ట్ కన్సల్టెన్సీ గా రాయపాటి ఓవర్సీస్ సక్సెస్ అయిందన్నారు.


కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్